# ఆనాడు ఆషాఢశుద్ధపాడ్యమి

'సౌరభము లేలచిమ్ము పుష్పవ్రజంబు ? చంద్రిక నేల వెదజల్లు చందమామ ?
ఏల సలిలంబుపాఱు? గాడ్పేలవిసరు ? ఏల నాహృదయంబు ప్రేమించు నిన్ను?'

—శ్రీ కృష్ణశాస్త్రి.

౧

అబ్బాయి అసలుపేరు మోహనరావు. అదే అతనితల్లి తండ్రులు బాలసార నాడు పెట్టినపేరు. అందుకు నిదర్శనంగా స్కూలు రిజష్టరులో ఆ పేరు నమోదు చేయబడిఉంది. అతని ఆదరనామముమాత్రం అబ్బాయే. అతనికుటుంబమూ మా కుటుంబమేగాక అతని ప్రాణస్నేహితులు, ఆప్తులనదగినవారు, అందరూ అతణ్ణి అబ్బాయిఅనే పిలుస్తారు. మా బంధువు లందరికీ—అతని అసలుపేరు తెలీనివాళ్లకుగూడా—అబ్బాయిఅంటే మోహనరావురూపమే స్ఫురిస్తుంది. అందుకు నేనూ ఆ పేరే వాడుతున్నాను.




అబ్బాయి ఇవాళ మూడుగంటల మెయిలులో వస్తాడని నిన్న సాయంత్రమే తంతివచ్చింది; ప్రపంచంలో ఉన్న ఆనందమంతా ఒక్కసారి మాకు లభించినట్లయింది. 'ఇవాళ అన్నయ్యవస్తాడు, నేను బడికి వెళ్ల' నని ఇంటివద్దనే ఉండిపోయింది మా చెల్లాయి. మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా మాభోజనా లయినాయి. తరువాత మా చెల్లెలికి చముర్రాసి తలదువ్వి రిబ్బనుపెట్టి జడవేశాను; సబ్బుతో ముఖంరుద్ది కాటుగా బొట్టూపెట్టి, ఓయలుపరికిణీ ఫ్రాకూ తొడిగాను. దానిముస్తాబు పూర్తయింది.

నేనూ చక్కగా తలదువ్వుకుని మా వొదినకోసం తెప్పించిన మల్లెపూలలో కొన్నిటిని అర్ధచంద్రాకృతిగా ముడుచుకున్నాను; ముఖం రుద్దుకుని కాటుకా బొట్టూ పెట్టుకుని, లేతగులాబీ సన్న చీరా, మబ్బువన్నె వాయిలీ జాకట్టూ ధరించి అద్దం ముందు నిలుచుని నా అందమంతా ఒకసారి చూసుకున్నాను.

తుమ్మెద రెక్కలవలె నిగనిగలాడుతూ, ముడిలో ఇమడక ముందుకు జారే నా ముంగురులూ - నాటికింద

కేంద్రంగా, సున్నగా తళతళ మెరిసే నా ముఖమూ చూస్తూఉంటే నల్లనిమేఘం లోంచి ఉదయించే పున్నపుచంద్రునిలోని శోభంతా స్ఫురణకువచ్చి 'అబ్బ! ఈ అద్దాన్ని వొదిలి ఎలావెళ్లడం?' అనిపించింది.

బింకమైన నా మబ్బురవికను ఏ మాత్రం లక్ష్యపెట్టక సన్ననిపైట తెరలోంచి పైకి ఉబుకుతున్న సమున్నతమైన నా వక్షోభాగం తిలకిస్తూఉంటే మేఘుని బిగి కౌగిలినుండి తప్పించుకుందికి పెనుగులాడే మెరపు కన్నెలోని అందమంతా మనసుకితట్టి చూసినకొద్దీ ఆ అందమధికమౌతున్నదేమో ననిపించింది.

మిగలపండిన తామలపాకువంటి పచ్చని నా చంపల మీదుగా వర్షమేఘంకంటె నల్లనై, నొక్కునొక్కులుగా ఇరుపక్కలా దొర్లే నా ముంగురులు చూస్తూఉంటే పండువెన్నెల్లో తేలిపోతూ ఎంతచూసినా తనివి తీరని యమునాతరంగాల్లోని శోభంతా తలుపుకు వచ్చింది.

చివరకు ఎలాగో అద్దంలోంచి నా శరీరాన్ని మళ్లించుకుని మా వొదిన మల్లెపూలు మా చెల్లెలిచేతి కిచ్చి ఇరువురమూ జానికిగారింటికి బయల్దేరాము.

మేము వెళ్లేసరికి చిట్టిని ఒళ్లోకూచో బెట్టుకుని జడ వేయడానికి అవస్థపడుతూంది మా వొదిన; చిట్టి ఎంత మాత్రము లొంగక అల్లర పెడుతూంది.

'నా బంగారుతల్లివికదూ! మా పిల్ల ఎంతబుద్ధిమంతురాలు! ఇదిగో, యివాళనాన్నగా రొస్తారు; నీకు హార్మణీపెట్టా, బొమ్మల పుస్తకాలూ అన్నీ తీసుకొస్తారు' అని మరిపింతా లాడుతూంది మా వొదిన.

చిట్టి మట్టుకు ఆమాట లేవీ వినిపించుకోవడంలేదు. అలాగని నాన్నగారు వస్తారంటే చిట్టికి ఉత్సాహంలేదని మనము భావించడం చాలాపొరపాటు; నాన్నగారి సంగతులు చెబుతే చిట్టికి వొళ్లు తెలీదు. అయితే ఇవాళ ఇంత నిర్లక్ష్యం వహించడానికి కారణం లేకపోలేదు.

వాళ్ళనాన్నగారు వెళ్ళి నప్పటినుంచీ చిట్టి దేనికి పంతంపట్టినా 'ఇవాళ నాన్నగా రొస్తారు; నీకు బొమ్మలపుస్తకాలూ అవీ తీసుకొస్తారు' అనిమరిపింతాలు పెడుతూ ఉండేది మా వొదిన; రెండుమూడుసార్లు పాపం ఆ మాటలు నిజంగా నమ్ముకుని నాన్న గారికోసం ఎంతో ఉబలాటపడిపడి తుదకు నిరాశ చెందింది చిట్టి.

ఒకసారి మోసమని తెలుసుకున్న తరువాత తిరిగి మోసపోయ్యే స్వభావంకాదు చిట్టిది; అందులో రెండు మూడుసార్లు దగాపడ్డ దీ విషయంలో. అందుచాత ఎంతప్రయత్నించీ కూడా ఇవాళ తనమాట నిజమేనని చిట్టికి నమ్మకం కలిగించలేక పోతూంది మా వొదిన.

సరిగా ఆ సమయానికే మేము వారింటికి వెళ్ళడం తటస్థించింది.

మమ్మల్ని చూసి 'అదిగో', చూశావా? ఉమా, విశాలం ఎలాముస్తాబై వచ్చారో నాన్నగారొస్తారనీ!' అంది చిట్టి నుద్దేశించి మా వొదిన. చిట్టికికూడా మమ్మల్ని చూడగానే ముస్తాబవాలని బుద్ధిపుట్టింది.

'నేను ఉమచాత జడవేయించుకుంటా' నంది చిట్టి.

నేను చిట్టిని దరికి తీసుకుని జడవేసి ముఖం రుద్ది కాటుగా బొట్టూ పెట్టాను. ఆకాటుగకళ్ళతో మధ్య నల్లనిమచ్చలో వెలుగుతున్న పున్నపు చంద్రుని లాగుంది చిట్టి ముఖము.

మా వొదిన చిట్టికి సిల్కు గౌనూ, రబ్బరుజోళ్ళూ తొడిగించి తాతగారు చేయించిన పులిగోరు పతకం గడియారపుగొలుసూ మెళ్ళో అలంకరించింది; ఆనందం పట్టలేక కెంపెక్కలాగు చిట్టి రెండుబుగ్గలూ ముద్దుపెట్టుకుంది. వెనువెంటనే 'బొట్టు రేపేసు కోకూ, గౌను మాపేసు కోకూ, కాటుక చెదరగొట్టేసు కోకూ' అని ఆజ్ఞాపించింది.

ఏవోపని, ఏదోకల్పన, ఏదోఅల్లర చేయకుండా ఒక నిముషమైనా ఉండలేని చిట్టికి ఇంతకంటె కఠినమైన ఆజ్ఞ ఇంకేముంటుంది? మరో అప్పుడైతే తల్లిఆజ్ఞని వెంటనే తృణీకరించేదే చిట్టి. కాని, అంత చక్కని తనముస్తాబుచూసి నాన్నగారెంత ముచ్చటపడతారో, రెండేళ్లబట్టి అణిగిఉన్న నాన్నగారి గాఢమైన ప్రేమంతా ముద్దులుగా తనచిన్నిబుగ్గలనిండా, తనువునిండా వర్షించినప్పుడు తనకుకలిగే ఆనందం ఎంత అమూల్యమైందో చిట్టికి బాగా తెలుసు.

అందుచాత కదుల్తే తన ముస్తాబు కెక్కడ భంగం వస్తుందో అనేభయంతో, ఆ నగలతో [illegible]లతో

బంగారుపంజరంలో బంధింపబడ్డ చిలకలాగు చిరిచాప మీద బుద్ధిగా కూచుంది చిట్టి.

'ఎప్పుడు నాన్నగారు వచ్చి తనముస్తాబు చూస్తారు? ఎప్పుడు అమ్మతొడుగు నగలూ దుస్తులూ అమ్మకిచ్చి వేసి తిరిగి స్వేచ్ఛను పొందుతాను'అనే దాని ఆలోచన.

మా వొదినకూడా జడల్లి బర్మాముడిచుట్టి దాని పైని వలయాకారంగా నా చాతుర్యమంతా వినియోగించి మల్లెపూలు ముడిచాను. ముఖం రుద్దుకుని కాటుకా బొట్టూ పెట్టుకుంది మా వొదిన.

నేనే ఆమె పెట్టెతెరచి కుసుమరంగుచీరా, లేసు పనిచేసిన నీలంరవికా తీసిఇచ్చాను ధరించమని.

ఆమె మొట్టమొదట 'అబ్బా! ఇవెందుకే ఇప్పుడూ!' అని గునిసింది; నామీద లేనికోపం నటిస్తూ వాటిని ధరించింది. అప్పటి ఆమె సౌందర్యం వర్ణించడానికి నాబోటి ఆడదానికి సాధ్యంకాదు.

మెరపు తీగవంటి పచ్చని శరీరచ్ఛాయ, చిరుతవాటు ముఖము, బెదరిన ఆడలేడి చూపుల్ని స్ఫురింపజేసేసోగ కళ్లు, పల్చని గులాబీపెదవులు, సన్నని నడుంపైని ఆధారపడిఉన్న సమున్నతమైన వక్షోభాగం అన్నీ సహజంగానే మా వొదిన చాలా అందమైందని చెప్పక చెబుతూఉంటాయి. అందులో రెండేళ్ళబట్టి కలుసుకోని తన ప్రాణానికి ప్రాణమైన భర్తను త్వరలో చూస్తాను కదా అని యెంత అణుచుకున్నా అణగక హృదయంలోంచి అలలవలె పొంగి వచ్చే ఉత్సాహం, భర్త దెగ్గిర లేనందున ఇంతకాలమూ యీఅలంకారవిషయంలో ఎంతో ఉపేక్షవహించి నేడొక్కసారి ఇంతలా శృంగారించుకోడం అన్నీ కలిసి మామూలుకన్న వెయ్యిరెట్లు అధికంగా ఆమెను ప్రకాశింప జేస్తున్నాయి.

నిజంగా ఆదుస్తులవల్ల ఆమె రాణిస్తున్నదా? ఆమెవల్ల ఆదుస్తులు రాణిస్తున్నవా అని ప్రశ్నిస్తే మట్టుకు నేను సరిగా జవాబు చెప్పలేను.

నవరత్నములు మలచిన సువర్ణాభరణం; పూలతో నిండిన మాలతీలత.

రత్నములవల్ల బంగారమే రాణిస్తున్నదో, బంగారంవల్ల రత్నములే రాణిస్తున్నవో- పూలవల్ల లతే శోభిస్తున్నదో, లతవల్ల పూలే శోభిస్తున్నవో చెప్పగలిగినవారు ఆ సంగతి సులువుగా గ్రహించగలరు.

మా ముస్తాబులన్నీ పూర్తయే సరికి గడియారంరెండు. మ్రోగించింది. మా దొడ్డమ్మకూడా అబ్బాయికి ఫలహారం, కాఫీ అవీ తయారుచేసి మా దెగ్గిరికి వచ్చింది. అందరం అబ్బాయి సంగతులే మాట్లాడుకుంటూ ఎప్పుడు మూడున్నర అవుతుందా అని గడియారంవైపు చూస్తూ కూచున్నాము.

కాలచక్రం గిర్రున తిరుగుతుం దంటారు; ఇవాళ చీమ గంగాయాత్రచేయడానికి తగినకారణం ఏమిటో మాలో ఎవరికీకూడా తెలీకుండాఉంది.

## ౨

— మోహనరావు నాకు బాల్యస్నేహితుడు. అతని కుటుంబమూ మా కుటుంబమూ ఇరుగుపొరుగున ఉండి చాలాకాలంనుంచీ ఎంతో మైత్రితో భేదమన్నమాట ఎరగకుండా వుండేవి. మాకూ వాళ్ళకూ ఏదో దూరపు బంధుత్వంకూడా ఉంది.

వాళ్ళనాన్న గోపాలరావుగారికి కాలేజీలో నూటయేభై రూపాయిలజీతం; వీధేబోయేవాళ్ళందరకూ పని లేకపోయినా తప్పక ఒకసారి ఆగిచూడాలని బుద్ధి పుట్టించే ఇంద్రభవనంవంటి మేడ; మేడకు నాలుగువైపులా ఫ్రేముకట్టినట్టు నందనవనంవంటి ఉద్యానవనం. గోడలనిండా సీనరీపటాలూ, నిలువుటద్దాలూ. గదుల నిండా పట్టు సోఫాలూ, పేముకుర్చీలూ. ఇంటినిండా వెండికంచాలూ, వెండిగిన్నెలూ. పైగా పట్నానికి సమీపంలో ఏభై అరవై ఎకరాల పొలమూ, పెద్దతోటాను. ఊర్లో అతనికి గొప్పపలుకుబడి; అతనిసలహా, అతనిసహాయం, అతనిసమ్మతిలేకుండా ఆ వూర్లో యే ఉద్యమమూ, యేకార్యమూ జరగవు.

మా నాన్నగారికికూడా హైస్కూలులో తెలుగు పండితుడుగా ముప్పై రూపాయలజీతం, చిన్నదైనా ఇమ్మయిన పెంకుటిల్లూ, విశాలమైన పెరడూ, కొంచెము భూవసతీ అన్నీ సంసారపక్షానికి మాకు కూడా ఏమీ లోపములేదు. మా నాన్నగారికీ గోపాలరావుగారికీ శరీరాలే వేరుగా ఉండేవి.

గోపాలరావుగారికి మోహనరావొక్కడే కుమారుడు. ఆడపిల్లలులేరు. అందువల్ల ఆడపిల్లలంటే అతనికి ప్రాణం. గోపాలరావుగారూ అతనిభార్యా అబ్బాయినీ, నన్నూ ఒక్కకంటితో చూసేవారు. మా వాళ్ళకు కూడా మొగపిల్లలు లేరు. అందుకని అబ్బాయి అంటే మావాళ్ళకు పుత్రవాత్సల్యం, అందుచేత నాకూ మోహనరావుకీ మంచిస్నేహం కుదిరింది. అప్పుడు మేమిరువురం బాల్యోచితమైన ఆటపాటల్లో కలిసి మెలిసి ఉండేవాళ్ళం.

గోపాలరావుగారు ప్రతిరోజూ సాయంత్రంపూట బడినుంచిరాగానే మమ్మల్నిద్దర్నీ గుర్రపుబండిలో కూచో బెట్టుకుని వాళ్ల పొలాలకేసి షికారు తీసుకు వెళ్లేవారు. ఊరుపొలిమేర దాటేక బండిదిగి అతను పొలాల గట్లంట గడ్డితో మెత్తనై, పాము మెలికలవలె వంపులుతిరిగిన కాలిబాటను వెళుతూంటే అతని వెనకాలే నేనూ అబ్బాయి చెట్టాపట్టాలు కట్టుకుని, సాయంత్రపు సూర్యుని సువర్ణకిరణాలుమీద వాల్తూఉంటే సిగ్గున తల వాల్చిన ప్రియుని కౌగిలిలోని నూతనవధువువలె వెన్నులభారాన వంగిన వరిచేలనూ, సిగ్గువీడిన కులటలవలె నిట్టగా నిలచిన జనుముచేలనూ చూసుకుంటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడిచేవాళ్లం.

సూర్యుడు క్రుంకుతూఉంటే దూరాన భూమిమీద వాలేచోట నీలిమాకాశం పూసుకునే వింత వింతరంగులు క్రమంగా మాయ మయేటప్పుడు, తూర్పుదేస చివరనున్న కొండలమీదకు మెల్లమెల్లగా చీకట్లు దిగేటప్పుడు, నిశాసుందరి అలసిన దివాకాంతుని కళ్లుమూసి చల్లగా నిద్రపుచ్చే సమయాన తిరుగుముఖమై చల్లని సంధ్య వెన్నెలలో ఈదుకుంటూ భోజనాలవేళకు ముందుగానే ఇళ్ళను చేరుకునేవాళ్ళం.

నేను తరుచు రాత్రిళ్ళు వారింటే గోపాలరావుగారి పంక్తిని అబ్బాయితో కలిసి భోజనం చేసేదాన్ని, నా పుస్తకాలూ అవీ వారింటే పెట్టుకుని అక్కడే చదువుకునేదాన్ని. నేను ఫస్టుఫారం చదువుతున్నప్పుడు అబ్బాయి ఫోర్తుఫారం చదివేవాడు. అందుచేత నేను లెఖ్ఖలూ ఇంగ్లీషూ అతనివద్ద చెప్పుకునేదాన్ని. రాత్రి తొమ్మిది పదిగంటలవరకూ అతడు చదువుతూఉంటే నేనుకూడా అంతవరకూ అతనితో పంతంపట్టి చదివేదాన్ని.

ఒక్కొక్కనాడు అటువంటి సమయంలో గోపాలరావుగారువచ్చి 'ఉమా, నీకుకూడా రాత్రి పదిగంటలవరకూ మేలుకుని చదవవలసిన అవసరం యేమీలేదు. పడుకో తల్లీ! జబ్బుచేస్తుంది' అనేవారు. నేను 'అలాగే'నని పుస్తకంమూసి అతనూ వెళ్ళిపోయిన వెంటనే తిరిగి పుస్తకం తెరచి చదవడం మొదలుపెట్టేదాన్ని.

అబ్బాయి నాపాఠాల్లో ప్రశ్నలువేసేవాడు. నేనూ అతని పద్యాలూ అవీ పుస్తకంచూసి వప్పగించుకునేదాన్ని. ఇద్దరం చదువయ్యాక ఒక్కదగ్గిరే పక్కలు వేసుకుని సరదాగా కథలూ కబుర్లూ చెప్పుకుంటూ ఏ పన్నెండు గంటలకో నిద్రపోయేవాళ్ళం. మళ్ళీ తూర్పు తెల్లవారకముందే ఎవరు ముందులేస్తారో అని పందాలు వేసుకుని మేలుకుని ఒకసారి కొత్తపాఠాలు చూసుకునే వాళ్ళం

అప్పటి మా ఆటలూ చదువూ అన్నీ తలుచుకుంటే నాకు మరి ఒళ్ళు తెలీదు. ముప్ఫై నలభైమంది కుర్రవాళ్ళున్న క్లాసులో నేనొక్కర్తెనే ఆడపిల్లను. తరుచు అన్ని పరీక్షల్లోనూ నాకే ఫస్టుమార్కు వస్తూ ఉండేది. అందుకు కుర్రవాళ్ళంతా నామీదకంటే మోహనరావుమీదనే అధికంగా అసూయపడేవారు.

మోహనరావుతో కలిసి తిరగడమన్నా, అతని స్నేహితులమనిపించుకోవడమన్నా స్కూలు కుర్రవాళ్ళందరకూ ఎంతో గొప్పగా ఉండేది. కేవలం మోహనరావు క్లాసులో ఫస్టుగా ఉంటాడనేకాదు, స్కూలు చదువూ, పరీక్షలూ, ఫస్టుమార్కులు పొందడం మోహనరావువంటి వానివిషయంలో గొప్ప చెప్పుకోవలసినవి కానేకావు. అవన్నీ అతనికి చిన్నపిల్లలాడుకునే ఆటలవంటివి.

అతనికి బాల్యంనుంచీ కవిత్వంలోనూ, గానంలోనూ మంచి ప్రావీణ్యం ఉండేది. వాటికి తగ్గ సుగుణ సంపత్తి కూడా ఉన్నందున స్కూలికి సంబంధించిన

ప్రతి ఉద్యమంలోనూ, ప్రతి సంస్థలోనూ అతనికి ముఖ్యమైన పార్టు ఉండేది. అందుకని అతనంటే మాష్టర్లందరికీ ఎంతో వాత్సల్యమూ, అతనితో తిరగాలనీ, అతని మిత్రుల మనిపించుకోవాలనీ కుర్రవాళ్ళందరకూ ఎంతో అభిలాషను.

నేను నిత్యమూ అతనితోటే కలిసిఉన్నందున నాకు గూడా చాలావరకు అతనిమాటలే, అతనిభావాలే, ఆ కవిత్వమే, ఆ గానమే అబ్బినవని చెబితే అందులో అతిశయోక్తి ఏమీలేదు.

ఒకొక్కనాడు మా యింట్లో నా పెళ్ళిభోగట్టా వస్తే మాఅమ్మ నాకు అబ్బాయిలాంటి మొగుణ్ణి చూడాలనేది. నాకా ఈడులో వివాహమంటే ఏమిటో తెలీకపోయినా ఆ మాటలు వినేసరికి నా ఒళ్ళు పులకరించేది. కాని అబ్బాయి నాకు భర్త అవుతాడన్న ఆశ మా ఇంట్లో ఎవరికీ లేదు. మాకూ వాళ్ళకూ ఎంతస్నేహమున్నా, ఆ స్నేహం కలికపూర్వమే చాలా బాల్యంలోనే అబ్బాయికి వివాహమైపోయింది.

అప్పటినుంచి నోములకూ పండుగులకూ అతనిభార్య జానకి అత్తవారింటికి వస్తూ ఉండడంచాత ఆమెకూ నాకూగూడా మంచి జతకలిసింది.

పదకొండోయేడు వెళుతుందనగా నాకు మావాళ్ళు పెళ్లిచేశారు. నాభర్త కప్పుడు పంథొమ్మిదోయేడు. మా ఊళ్లోనే విద్వాన్ చదువుతూఉండేవారు.

నా వివాహమైన రెండేళ్ళకు నాకు కార్యంచేసేకే మా నాన్నగారు కాలంచేశారు. అతను పోయేక అతనియందున్న గౌరవంచాతనూ, మావారుకూడా విద్వాన్ పాసయిఉండడం చాతనూ మా నాన్నగారి ఆ మాష్టరు పదవిలోనే, ఆ జీతంమీదనే మా అయన్ని వేశారు. మొగపిల్లలులేక మమ్మల్నే నమ్ముకున్నందున నేనూ ఆయనా మా అమ్మవద్దనే ఉండిపోయాము.

ఇదిలా ఉండంగా నాకన్న ఏడాదిముందుగానే జానకి కాపరానికి వచ్చింది. అప్పటికి అబ్బాయి స్కూలు ఫైనలు పాసయాడు. అబ్బాయి 'ఎఫ్. ఏ.' రెండో యేడు చదువుతూ ఉండగా టైఫాయిడ్‌జ్వరం వచ్చి గోపాలరావుగారు హఠాత్తుగా చనిపోయేరు. అతను పోయిన నెలనాడే అబ్బాయితల్లికూడా కాలంచేసింది. ఆమె చనిపోయేటప్పుడు మాదొడ్డమ్మకూడా (అబ్బాయి పెత్తల్లి; మేమందరం ఆమెను దొడ్డమ్మ అనే పిలుస్తూ ఉంటాము) చెంతనుంది. అప్పటికి తొమ్మిదిమాసాల గర్భిణి అయిన జానకినీ, అబ్బాయినీ అక్కయ్య చేతుల్లో ఉంచి ప్రాణంవిడిచింది అబ్బాయితల్లి.

అది లగాయితూ మా దొడ్డమ్మ అబ్బాయియింటనే ఉండి తల్లిలాగు వారిసంరక్షణ చేస్తూంది. జానకికి తన చేతులతోనే పురుడుపోసి చిట్టిని తన చేతులమీదనే పెంచింది. అబ్బాయి 'బి. ఏ.' పాసయే సరికి చిట్టికి రెండోయేడు. అప్పుడే అతడు 'బి. యల్.' చదువుకునేందుకు మద్రాసు వెళ్లాడు. ఆ వెళ్ళడం వెళ్ళడం ఇంతవరకూ యే శలవులకూ ఇక్కడకు రాలేదు. మళ్లా ఇదే రావడం——

## 3

గడియారం ఇప్పుడే మూడుగంటలతరవాత అరగంటకొట్టింది. ఈ పాటికి మెయిలు ప్లాటుఫారం మీదకు వస్తుంది. అక్కణ్ణించి ఇంటికి రావడానికి పదినిముషాలకన్న యెక్కువపట్టదు. పదినిముషాలు ఎంతలో గడుస్తాయో మాకు తెలీని విషయంకాదు. కాని ఆ పదినిముషాలూ గడవడానికి అప్పుడెందు కింత కాలం పడుతూంది? కాలానికి గూడా దేవాసురులవలె కామరూపం ఉన్నట్టుంది. యుగ మొకక్షణం లాగు క్షణ మొకయుగం లాగు మారిపోగలదు కాబోలు!

మూడూ నలభై కాకముందే వీధిగుమ్మంలో జట్కా ఆగిన చప్పుడయింది. మెరుపు మెరసినట్టు మా అందరి ముఖాలూ ఒక్కమాటు తళుక్కుమనిపోయేయి. 'అదిగో! వచ్చాడు' అన్నమాటలు రెక్కలు కట్టుకుని అత్యుత్సాహంతో నా పెదవుల్లోంచి బైటికురికేయి.

'అద్దీ, మా నాన్నవొచ్చాడు. మా నాన్న' అని గంతులు వేసుకుంటూ చిట్టి చప్పున సావిట్లోకి పరిగెత్తింది. వెనకాలే మా చెల్లెలూ, జానకీ, దొడ్డమ్మకూడా సావిట్లోకి వెళ్లారు. నాకుమాత్రం అంత హడావుడిగా అతణ్ణి కలుసుకుందికి బుద్ధి పుట్టలేదు. అతణ్ణి చూడాలని నాకెంత ఆతృతగా ఉన్నా, నా ఆతృత అతనికి తెలీకుండా

కొంతమాత్రం ఇష్టంలేదు. అందుచాత ఎవరికీ కనబడకుండా చీడీ చివరనున్న వసారాలో ఒకమూల నక్కిచూస్తున్నాను. ఏంజరుగుతుందో అని.

ఇంతలో 'టక్‌టక్'మని జోడు చప్పుడు చెవినిబడి అది అంతకంతకూ ముందుకు వస్తున్నట్లయింది. నేనూ తొంగిచూసేసరికి చిట్టినెత్తుకుని ముద్దులాడుతూ అబ్బాయి, వెనకాలే దొడ్డమ్మా, జానకీ, మా చెల్లెలూ అందరూ గబగబా గదిలోకి నడిచారు. అందుచాత అబ్బాయి ధరించిన ఉత్తరీయపు చివరమాత్రమే చూడగలిగాను.

దొడ్డమ్మ నెమ్మదిగా అబ్బాయి ప్రయాణపు భోగట్టాలు చేస్తూంది. అబ్బాయి తనెప్పుడు బయల్దేరిందీ, ఎక్కడెక్కడ కాఫీతాగిందీ, ఎక్కడ భోజనంచేసిందీ మొదలైన సంగతులు మెల్లగా చెబుతున్నాడు. ఆహా! ఆ మాటలలో ఎంతమాధుర్యం! ఎంతనాగరికత!! ఎంత వేగం అతణ్ణి చూస్తానా అనిఉంది. గదిలోకి వెళ్ళ దలుచుకున్నాను. కాని—, నేనంటే అతనికోసం ఇంత తహతహలాడి పోతున్నాను. నాగురించి ఎప్పుడేనా అతడు తలుస్తాడా? నన్నుగూర్చి ఆలోచిస్తాడా? అతని మీద నా కెంత మమకారం ఉన్నా, అతనికిగూడా నామీద ఆ మోస్తరుగా ఉన్నట్టు తెలిస్తేగాని నేన తణ్ణి చూడలేను. నామీద నాకంత అభిమానం. వెళ్ళబోయి...నన్ను నేనే ఆపుకున్నాను.

ఇంతలో 'విశాలం! మీ అక్కయ్య యేంజేస్తూంది?' అని అబ్బాయి పలుకులే పాటవలె నా చెవిని సోకేయి. నాశరీరం పులకరించింది. మాచెల్లెలి జవాబుమాత్రం వినిపించలేదు. అది జవాబు చెప్పలేదో చెబితే ఆనందపారవశ్యంలో ఆ మాటలు నా చెవిని బడలేదో!

దొడ్డమ్మగొంతుమాత్రం వినబడింది:

'ఏదీఉమా? ఇంతసేపాయి ఇక్కడేఉందీ!...ఇంటికి వెళ్ళింది కాబోలు! వస్తుందిప్పుడే.'

'విశాలం! ఓ సారిపిలుద్దూ నే వచ్చాననీ. చూడాలనుందీ!' అని అబ్బాయి కంఠస్వరమే విస్పష్టంగా వినబడింది.

ఆమాటలతో అతణ్ణి చూడకుండా ఉండగలిగే ఓపిక నాలో పూర్తిగా సడలిపోయింది. పైటచెరగుతో ఒకసారి ముఖంతుడుచుకుని, రేగినజుట్టు సవరించుకుని నెమ్మదిగా గదిగుమ్మం సమీపించాను. ఎంత నెమ్మదిగా వేసినా అడుగడుక్కీ కాళ్ళు తడబడ్డాయి. నాలో జనిస్తున్న ఆనందోద్రేకాన్ని చల్లార్చుకోడానికి గుమ్మందగ్గిర ఒక్కనిముషం ఆగి లోనికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి చిట్టిని ఒళ్ళోకూచోబెట్టుకుని సందర్భం లేకుండా అదిచెప్పే ముద్దుమాటలకు మురిసిపోతున్నాడబ్బాయి.

నేను చిరునవ్వుతో 'ఏఁవబ్బాయి! వచ్చావూ!' అని పలకరించాను.

నా మాట వినగానే అబ్బాయి చటుక్కున నిర్ఘాంతపోయినట్టు నావంక నాముఖంలోకి చూసి...చూస్తూ అలా ఉండిపోయాడు ఒక్కక్షణం. అతని చూపు మెరపుతీగ ప్రాకినట్టు నాముఖంనుంచి పాదాలవరకూ మెల్లగా జారింది. నేను సరిగా అతనివంక చూడలేక కళ్ళు పక్కకు తిప్పుకున్నాను.

ఆశ్చర్యం సూచించే స్వరంతో అబ్బాయే అన్నాడు: 'ఎవరిదీ! ఉమేనా?'

ఔనన్నట్టు మందహాసంతో తలఊచింది దొడ్డమ్మ.

మళ్ళీ అబ్బాయిగొంతుకే.

'ఈరెండేళ్ళలోనూ ఎంత యెదిగిందీ! పోల్చుకోనేలేక పోయాను.'

ఆమాటలతో నాచెక్కిళ్ళు చప్పున జాజువారాయి. నాముఖంమీద ఆనందం, సిగ్గూ, ప్రూన్పాటూ ఒకేసారి ఇట్టిట్టే అలుముకు పోయాయి. చప్పున ముఖం దించుకున్నాను.

'నువ్వుమాత్రం బలీలేదూ మెడ్రాసువెళ్ళీ?' అన్న మాట నామనసులో బయల్దేరి పైకిరావాలని ఎంతో ఉబలాటపడింది. అనగలిగితే అందులో అన్యాయమేమీలేదు. చెన్నపట్నం వెళ్ళినప్పటి అబ్బాయికీ ఇప్పటి అబ్బాయికీ చాలా భేదముంది. ఈరెండేళ్ళలోనూ అబ్బాయికి మునుపటికంటె రూపువచ్చింది. చెన్నపట్నపు సముద్రపుగాలీ, ఆచదువూ, నాగరికతా అన్నీ అతని కొకవిధమైన దీప్తినిచ్చాయి. మునుపటికంటె చాలా పుష్టిగా కూడా ఉన్నాడు. అయితే ఆ మాట

అతని ముఖాన అనగలిగే శక్తి ఎంత వెతికినా అప్పుడు నాలో కనబడలేదు. అందుచేత అది మనసులోనే 'నువ్వుమాత్రం బలిలేదూ మెడ్రాసువెళ్ళి?' అని అటునుంచి యిటూ ఇటునుంచి అటూ రెండుమూడుసార్లు తిరిగి అక్కడే ఆగిపోయింది.

'కూర్చోవే నిలుచున్నావేమిటే' అని జానకి అన్న మీదట ఆమెపక్కనే ఓసరిల్లి కూచున్నాను. ఇంతలో మా దొడ్డమ్మ ఫలహారం, కాఫీతెచ్చి మా కందరకూ ఇచ్చింది. అందరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వాటిని పుచ్చుకున్నాము. మధ్యమధ్య అబ్బాయి మా యోగక్షేమాలు అడుగుతూ నావద్దనుంచి క్లుప్తమైన జవాబులు పొందేడు.

మాఫలహారాలన్నీ అయేక మాదొడ్డమ్మ 'అబ్బాయి! రెండు హార్మణీపెట్టెలు తీసుకురమ్మని రాయించాను. తెచ్చావూ?' అని అడిగింది.

'ఆఁ. తెచ్చాను. అంటూ పెట్లోంచి ఒక హార్మణీయం పైకితీసి రెండుమూడు మెట్లు మనోహరంగామీటి వినిపించాడు. తరువాత చిట్టికూడా తన చిన్నివేళ్ళతో మూడేసిమెట్లను కలిపి నొక్కుతూ తనపాండిత్యం వెల్లడించింది.

తరువాత 'ఉమా! ఏదేనా వాయించి పాడుదూ వినాలనుందీ!' అన్నాడబ్బాయి.

అతడంత చనువుగా మాట్లాడుతాడని నేననుకోలేదు. నాకు చాలా సరదావేసింది. అతనిమాట నిరాకరించడానికిగాని ఆచిన్నమాటపైని పాడడానికి గాని నోరురాక ఊరుకున్నాను. నే నూరుకోడం చూసి దొడ్డమ్మ 'పాడుదూ! ఇంతలో నోటిముత్యాలు ఒలికిపోవూ; సరదాపడుతున్నాడూ!' అంది.

హార్మణీయం అందుకుని మెల్లగా మీటుతూ ఒక కృతిపాడాను. పాడుతున్నంతసేపూ అతడేమి హేళన చేస్తాడో అని నాకు భయంగానేఉంది. ఎందుచాతనంటే అబ్బాయి నాకంటె వెయ్యిరెట్లు మనోహరంగా వాయించి పాడగలడని నాకు తెలుసు. పాటంతా అయాక 'చాలాబాగుంది. ఈలోపున బాగా కృషిచేసినట్టుందే!' అన్నమాటలు అబ్బాయి నోటమ్మట వెలువడ్డాయి.

ఆచిన్న మెప్పుకే నాకెంతో సంతోషమైంది. పైగా అతని మాటలు నాకు అమితమైన ఆశ్చర్యంకూడా కలిగించాయి. అబ్బాయిని నేను చిన్నప్పటినుంచీ చూస్తున్నాను. ఇంతవరకూ ఒక్కసారికూడా దేనికీ అతడు నన్ను మెచ్చుకున్న జ్ఞాపకం నాకులేదు. పైగా, నలుగురూ నన్ను మెచ్చుకుంటున్న సమయాల్లోకూడా ఎన్నోసార్లు అతడు నాలోపాలనే ఎంచి చూపించడానికి ప్రయత్నించడం నేను మరిచిపోలేదు. అటువంటి అబ్బాయి పెదవులంట ఇప్పుడిటువంటి మాటలొస్తాయని నేనెన్నడూ అనుకోలేదు.

ఈసారి అతడు నిజంగా అంటున్నాడని తెలిసికూడా 'చాల్లే, ఆక్షేపణ' అన్నాను తమాషాకి.

'ఆక్షేపణకాదు; నిజంగానే అంటున్నాను. ఇంత చక్కగా పాడగలుగుతావనుకోలేదు' అన్నాడు నా కళ్ళలోకి చూసి నవ్వుతూ.

అతనిమాటలు నన్ను పరవశురాల్ని జేశాయి. నా చెక్కిళ్ళు కెంపుబారాయి. నా ఆనందం బలవంతాన కప్పి పుచ్చి, అతనన్నమాటల్లో నిజమేమీ లేనట్టు నటించి, నిర్లక్ష్యంగా నవ్వినట్టు నవ్వుతూ అన్నాను. 'మరేమిటంటావు లేకపోతే.'

తరువాత అరగంటవరకూ మాసంభాషణ అనేక విషయాలమీద ఎంతో సరదాగా నడిచింది. ఇంతలో అయిదు కొట్టినందున అబ్బాయికి వేగం వంటకావాలని దొడ్డమ్మ లేచింది. నేనూ లేచాను యింటికిపోవాలని. మాచెల్లెలుమాత్రం నేను తరువాత వస్తానంటూ ఎంతో పనున్నదానివలె అబ్బాయిచెంత కూచుంది.

ఇంత స్వల్పకాలంలో అబ్బాయితో మాచెల్లెలికి ఇంత పరిచయం కావడానికి చిన్నకథ ఉంది. మాచెల్లెలిప్పుడు మూడోక్లాసు చదువుతోంది. ఈమధ్యను బడిలో దానిచేత ఆవూ, మేకా మొదలైనవాటిమీద రెండుమూడు వ్యాసాలు వ్రాయించారు దాని మాష్టర్లు. వాటిలో దానికి ఏభైకి నలభైమార్కులకు పైగా వచ్చాయి.

అబ్బాయి గొప్ప విద్వాంసుడనీ అటువంటి విద్వాంసుడే వాటిని మెచ్చుకోందికి తగినవాడనీ దాని వుద్దేశం. అబ్బాయి వస్తున్నాడన్న వార్త తెలిసినప్పటినుంచీ

'అబ్బాయి ఎప్పుడు వస్తాడు? తన వ్యాసాల పుస్తకం ఎప్పుడతనికి చూపిస్తాను?' అని మా చెల్లెలుపడుతున్న ఉబలాటానికింక అంతులేదు. అందుచాత అబ్బాయివద్దకు మేము బయల్దేరినప్పుడు ఆ వ్యాసాల పుస్తకం కూడా మా చెల్లెలివెళ్ళ నతుక్కునే వచ్చింది. మాటల సందర్భంలో దానిని అబ్బాయి చూసేటట్టుకూడా చేసింది మా చెల్లాయి.

అబ్బాయి ఆ కథలన్నిటినీ శ్రద్ధతో చదివి మెచ్చుకోడమే కాకుండా తను చెన్నపట్ణంనుంచి తెచ్చిన మంచి మంచి బొమ్మల పుస్తకాలుకూడా దానికి బహుమతిచేశాడు. కాని దానిత్రవాత పూర్తిగా అర్థమయే మెచ్చుకున్నాడని ఎవరమూ అనుకోలేము. ఎందుచాతనంటే మా చెల్లెలి వ్రాతలోని 'మ' కు 'య' కు, 'ష' కు 'ఫ'కు, 'ఘ' కు 'భ' కు, ఉన్నభేదాన్ని గుర్తించడం రీసెర్చిపండితులకు గూడా అంతసులభమైనపని కాదు.

నేను ఇంటికి వెళ్ళాక మా అమ్మా, అయనా అబ్బాయిని చూడడానికివెళ్ళారు. వారు వచ్చేటప్పుడు వారి వెంట హార్మణీయంపెట్టా, మంచి విలువైన కళ్ళద్దాలూ, పైట పిన్నులూ, తలపిన్నులూ మొదలైన వాటితో నిండిన రెండుమూడు వింత వింత పెట్టెలు మా యింటదిగాయి. దొడ్డమ్మ బలవంతాన ఆ రాత్రి మేమందరమూ అబ్బాయి పంక్తినే భోజనం చేశాము.

ఆ రాత్రల్లా నాకు సరిగా నిద్రలేదు. అబ్బాయి సంగతులే తలచుకున్నాను. అతడు నామీదచూపిన ఆదరణా, నా ముఖంమీద వాలి వింతగా నా మనసుని కలవరపెట్టే అతనిచూపూ, అరవిచ్చిన గులాబివలె చిరునవ్వు లొలికే అతనిపెదవులూ, పువుదేనెవలె వాటిగుండా వెలువడే తీయని పలుకులూ—నే పాడిన పాటా, నా మాటలూ, అవి అతనిహృదయంలో కలిగించిన పరిణామం అన్నీ ఎంత ఆటంకపరచినా లొంగక నా ధ్యానంలో అటూఇటూ సంచరించాయి.

—ఆకుండి సత్యనారాయణ.

☞ ఉమను మెచ్చిన అబ్బాయి, అబ్బాయిని మెచ్చిన ఉమ. వీరి అనంతరచరిత్ర యెట్లుండును? పై మాసపు సంచికలో చదువగలరు.

విజ్ఞానముకొఅకు, వినోదముకొఅకు

ఆంధ్రభూమి

సచిత్ర మాసపత్రికను పఠింపుడు.

మనోహరకథావ్యాసములు, హాస్యవ్యాసములు, మహాపురుషుల జీవితములు, మణిమాల, కారపుశొసగలు, విద్యార్థారములు, జిజ్ఞాస : మీమాంస, మహిళాలోకము, బాలబాంధవి, ఆరోగ్యవిజ్ఞానము, రాష్ట్రేతరాంధ్రులు, ఇన్నూ రెన్నువిషయములు, ఆంధ్రునిడైరి మున్నగు ఎన్నో విషయములు విద్యాధికులచే వ్రాయబడినవి ప్రతిసంచికయందును ఉండును.

సంపాదకుడు : ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

స్థాపితము : 1933. సాలు చందా రూ 1-8-0. విడి సంచిక 2 అణాలు.

చిరునామా : ఆంధ్రభూమి, వేపేరి, మదరాసు.